

నేడు ఏలూరులో పర్యటించనున్న మంత్రి మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 22వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా అధికారులతో సమావేశమవుతారు. తిరిగి 11 గంటలకు ఏలూరు నుండి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు ఉంగుటూరు మండలం చేబ్రోలు రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఉంగుటూరు నుండి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

ఉంగుటూరు: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 22న ఉంగుటూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. చేబ్రోలు సచివాలయం- 1 వద్ద ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ సమావేశంలో ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. చేబ్రోలు, గొల్లగూడెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఒక ప్రకటనలో వెల్లడించారు.

ధాన్యం కొనుగోలుకు..
సర్వం సిద్ధం

నేటి నుంచి ఏలూరు జిల్లాలో, రెండు రోజుల్లో 'పశ్చిమ'లోనూ కొనుగోళ్లు ప్రారంభం

'పశ్చిమ'లో 4.10 లక్షలు, ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

రెండు జిల్లాల్లో 590 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

సరిపడా సంచులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు ప్రకటన

ఇ-క్రాప్‌లో నమోదు కాని కౌలురైతుల పరిస్థితి ఏమిటి?

భారీ వర్షాల హెచ్చరికలతో రైతుల్లో తీవ్ర ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు మంగళవారం నుంచి ఏలూరు జిల్లాలో ప్రారంభం కానున్నాయి. వర్షాల నేపథ్యంలో రెండు రోజుల వ్యవధిలో పశ్చిమగోదావరి జిల్లాలోనూ ధాన్యం కొనుగోలుకు అక్కడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు ఇప్పటికే అధికారులు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానుండటంతో ప్రక్రియ ఏవిధంగా సాగుతుందోనని ఉత్కంఠ రైతుల్లో నెలకొంది. వైసిపి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఇకనుంచైనా తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుకుంటున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పంట చివరి దశకు చేరింది. మెట్ట ప్రాంతం జంగారెడ్డిగూడెం, ఉంగుటూరు వంటి నియోజకవర్గాల్లో పంటపొలాలు మాసూళ్లకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లనూ అధికారులు పూర్తి చేశారు. ఏలూరు జిల్లాలో 5.60 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి, 'పశ్చిమ'లో 4.10 లక్షల టన్నులు దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. అందుకు తగిన విధంగా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో 250, పశ్చిమలో 340 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సంచులు సైతం తగినన్ని అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్న పరిస్థితి ఉంది. కొనుగోళ్లు ప్రారంభమయ్యాక పరిస్థితి ఎలా ఉంటుందో వేచిచూడాలి.



ఇ-క్రాప్‌లో నమోదు కాని కౌలురైతుల పరిస్థితి ఏమిటి?

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లు అంతా ఇ-క్రాప్ నమోదు ఆధారంగానే సాగింది. కౌలురైతుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు చేసేవారు కాదు. దీంతో భూయజమాని పేరుపైనే కౌలురైతులు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇది కౌలురైతులకు పెనుశాపంగా మారింది. భూయజమాని ఖాతాలోకి ధాన్యం సొమ్ములు జమయ్యేవి. ఈ సొమ్ము ఇవ్వడానికి యజమానులు కౌలురైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవారు. ఇక రవాణా ఛార్జీలు జమైనా కౌలురైతులకు ఇచ్చేవారు కాదు. గట్టిగా మాట్లాడితే పొలం కౌలుకు ఇవ్వబోమని బెదిరింపులకు దిగేవారు. దీంతో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కౌలుచట్టంలో మార్పులు చేయకపోవడంతో ప్రస్తుత ఖరీఫ్‌లోనూ ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు చాలావరకూ నమోదు కాలేదని తెలుస్తోంది. ఇ-క్రాప్‌లో నమోదుకాని కౌలురైతులు ధాన్యం తమ పేరును అమ్ముకోవాలా.. లేక భూయజమాని పేరున విక్రయించాలా అనే దానిపై రైతుల్లో చర్చ సాగుతోంది. సాగు చేసిన కౌలురైతుల్లో 50 శాతానికిపైగా రైతుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు కాలేదని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో మాదిరిగానే కౌలురైతుల పరిస్థితి ఉంటే మార్పు ఏం జరిగినట్లు అని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభమయ్యాక మరిన్ని సమస్యలు బయటపడే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు.

భారీ వర్షాల హెచ్చరికలతో ఆందోళన..

ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లాకు భారీ వర్షాల ముప్పు ఉన్నట్లు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటి నుంచే అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పంట చివరి దశకు చేరిన తరుణంలో భారీ వర్షాలు కురిస్తే పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికే ఖరీఫ్‌లో విరుచుకుపడిన ప్రకృతి వైపరీత్యాలకు రెండుసార్లు రైతులు పంటను నష్టపోయారు. ఉన్న పంట కూడా చేతికి అందకపోతే అన్నదాత తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. ఈ గండం ఏవిధంగా గట్టెక్కాలా అని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

స్థలం మా ఆధీనంలోనే ఉంది

ఏలూరు ప్రార్ధన సమాజం ఉపాధ్యక్షులు చల్లా కేశవచంద్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు ఆర్ఆర్‌పేట ఈదరవారి వీధిలోని ఏలూరు ప్రార్ధన సమాజం తమ ఆధీనంలోనే ఉందని, ఎటువంటి ఆక్రమణలకు గురికాలేదని ఆ ప్రార్ధన సమాజం ఉపాధ్యక్షులు చల్లా కేశవచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ సోమవారం ఏలూరులో 'భూ'చోళ్ల శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి ప్రకటన విడుదల చేశారు. ప్రార్ధన సమాజం భూమి ఆక్రమణకు గురికాలేదని, ఈ వార్తను తాము ఖండిస్తున్నామని పేర్కొన్నారు. స్థలం పూర్తిగా సమాజం ఆధీనంలోనే ఉందని తెలిపారు. ఇటీవల కొద్దికాలంగా అనివార్య పరిస్థితుల వల్ల సమాజం ఆధ్వర్యాన కార్యకలాపాలు ఏవీ జరగడం లేదని పేర్కొన్నారు. కార్యకలాపాలు మళ్లీ పునరుద్ధరించాలనే సంకల్పంతో కొత్త కమిటీని సొసైటీలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం సమాజం ఆవరణలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ దీనిపై సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీనికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ఈ మధ్య కురిసిన వర్షాల వల్ల ప్రార్ధన సమాజం ఆవరణ అంతా మొక్కలు, తుప్పలతో నిండిపోయిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడి సమావేశ నిర్వహణ కష్టతరం కాబట్టి సమాజ ఆవరణలో ఉన్న మొక్కలు, తుప్పలు జెసిబితో తొలగించి వాటిని అక్కడి కాపలాదారులతో తామే శుభ్రం చేయించామని తెలిపారు. దీనిలో ఇతరుల ప్రమేయం ఏమీ లేదని పేర్కొన్నారు.

భూముల కబ్జాపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో ప్రభుత్వ, సేవా సంస్థల భూములను అధికార పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో వారి అనుచరులు కబ్జా చేయాలని చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని ఈదరవారి వీధిలో ప్రార్ధనా సమాజపు స్థలంపై కొందరు కన్నేసి ఆక్రమించాలని చూస్తున్నట్లు వార్తలు రావడం, రూ.20 కోట్లు విలువచేసే వెయ్యిగజాల స్థలాన్ని చదునుచేయడం చూస్తే ఆ స్థలాన్ని ఆక్రమిం చడం కోసమే ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు అర్థమవుతుం దని పేర్కొన్నారు. వందేళ్లకు పైగా ఏలూరు ప్రజలకు, మహిళలకు అండగా నిలిచి మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా కృషి చేసి సర్వమత సమ్మేళనం నిర్వహిం చిన ప్రార్థనా సమాజం ఆస్తులు ఆక్రమణకు గురి కావడం బాధాకరమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనూ సుబ్బమ్మదేవి స్కూలు గ్రౌండ్ ఈ రకంగానే ఆక్రమణకు గురైతే ప్రజలు, స్కూలు పూర్వ విద్యార్థులు పోరాటాలతో వెనక్కు తగ్గారని పేర్కొన్నారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వ పెద్దలే కంచె చేను మేసినట్లు వాటిని ఆక్రమిస్తే ఇక ప్రజల ఆస్తులను రక్షించేది ఎవరని ప్రశ్నించారు. తక్షణం జిల్లా కలెక్టర్ ఈవిషయమై స్పందించి ఆక్రమణదారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు ఎంతటి వారైనప్పటికీ వెనుకాడరాదని కోరారు. దీనికి అవసరమైతే కలిసొచ్చే రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలతో కలిసి సిపిఎం ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో శవాలతో సైతం వ్యాపారం చేయడంపై ఆందోళన వ్యక్తంచేశారు. బతికున్నంత కాలం తగిన రక్షణ, జీవన ప్రమాణాలు అందించలేని ఈ ప్రభుత్వాలు ఆఖరికి చచ్చిపోయాక కూడా రక్షణ ఇవ్వలేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులకు కూతవేటు దూరంలో ఉన్న ఆసుపత్రిలో శవాలకు కూడా రక్షణ లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. తక్షణం కారకులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా తగు ఏర్పాట్లు చేయాలని కోరారు.

అమరులకు అంజలి ఘటించడమే వారికిచ్చే అతి పెద్ద గౌరవం

ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజల రక్షణ ధ్యేయంగా పని చేస్తూ దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరులకు అంజలి ఘటించడమే వారికిచ్చే అతి పెద్ద గౌరవం అని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం గ్రౌండ్‌లో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఐజి అశోక్‌కుమార్ సారథ్యంలో సాగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి హాజరయ్యారు. పోలీసు సిబ్బంది, ఎఆర్ సిబ్బంది కవాతు నిర్వహించారు. అనంతరం అమరవీరుల సంస్మరణ స్తూపం వద్ద పోలీసు అధికారులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఐజి అశోక్‌కుమార్ మాట్లాడుతూ రోజురోజుకీ పోలీస్ శాఖ విధులు సవాళ్లుగా మారుతున్నాయని, కేసుల దర్యాప్తు క్లిష్టంగా మారుతుందని అన్నారు. అమరవీరుల త్యాగాలను నెమరు వేసుకుంటూ వారి ఆశయ సాధనకు పోలీసు శాఖ ముందుకెళ్తుందన్నారు. ఈ ఏడాది దేశంలో 216 మంది పోలీసులు అమరులయ్యారని, మన రాష్ట్రంలో ఇద్దరు అమరులయ్యారని తెలిపారు. పోలీసుల విధుల్లో ప్రజలను భాగస్వాములను చేయడానికి అవగాహనా సదస్సులు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పోలీసుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామంటే పోలీసులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించడం వల్లేనన్నారు. ప్రజలు పోలీసుల విధులకు సహకరించాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ పోలీసులు సేవలు ఎనలేనివని కొనియాడారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ పోలీసు శాఖలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబ సభ్యులను కంటికి రెప్పలా కాపాడుతామన్నారు. అల్లరి మూకల దాడిలో ఆగిరిపల్లి కానిస్టేబుల్ గంధం నరేంద్ర మృతి చెందడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. పోలీసు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. దేశం మొత్తం మీద అమరవీరులైన 216 మంది పేర్లను జిల్లా అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి ఎన్ఎస్ఎస్.శేఖర్, సిఐలు మల్లేశ్వరరావు, సత్యనారాయణ, వైవి.రమణ, కోటేశ్వరరావు, విజయ్‌కుమార్, పవన్ కుమార్. సిబ్బంది పాల్గొన్నారు. ఇటీవల మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు జ్ఞాపికలను అందజేశారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



మానవహారం

నగరంలో భారీ ర్యాలీ

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని వారి త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు సిబ్బంది, విద్యార్థులు కలిసి భారీర్యాలీ ఏలూరు నగరంలో నిర్వహించారు. ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.

గురువారం నుంచి భారీ వర్షాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

వాతావరణశాఖ ముందస్తు సమాచారం మేరకు ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లావ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో భారీ వర్షాలు తదితర అంశాలపై అధికారులతో ఆమె సమీక్షించారు. కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామని, తుపాను కారణంగా ఒడిశ్శాలో అధికవర్షాలు నమోదవుతాయనే హెచ్చరికల దృష్ట్యా గోదావరి వరద కూడా వచ్చే అవకాశం ఉంటుందన్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, తహశీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో చెరువులు కూడా నిండుగా ఉన్నాయని, ఈ దృష్ట్యా చెరువు గట్లకు ఎటువంటి ప్రమాదం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నేపథ్యంలో అందుకు సంబంధించి ఓరియంటేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సోమవారం సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటర్ ట్యాక్స్ వసూళ్లకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఉద్ఘాటించారు. మహిళలంతా స్వశక్తితో ఎదిగి జీవనోపాధి పొందాలని ఆకాంక్షించారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల స్టాల్స్‌ను నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబుతో కలిసి ఎంఎల్ఎ చంటి సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాల్స్‌లోని వివిధ ఉత్పత్తుల వివరాలను, వాటిని తయారు చేసేందుకు అయిన వ్యయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కొన్ని ఉత్పత్తులను ఎంఎల్ఎ చంటి స్వయంగా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు మెప్మా బజార్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ డ్వాక్రా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ డ్వాక్రా ఉత్పత్తులను ప్రజలందరూ ఆదరించాలన్నారు. తమ కుటుంబాలకు ఆసరాగా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ బి.ఝాన్సీరాణి, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, జాల బాలాజీ, ఎస్ఎంఆర్.పెదబాబు, కార్పొరేషన్ పిఒ కృష్ణమూర్తి, టిడిపి నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, పలువురు కార్పొరేటర్లు, సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.



మెప్మా స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

చినవెంకన్న సన్నిధిలో మంత్రి నాదెండ్ల

ద్వారకాతిరుమల : రాష్ట్ర పౌర సరఫరాలు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ద్వారకాతిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు నివృతరావు, ఆలయ ఇఒ సత్యనారాయణ మూర్తి, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు జగన్నాధచార్యులు (రాంబాబు) స్వామివారి ఆలయంలో మంత్రికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదాశీర్వచన మండపంలో వేదపండితులు మంత్రికి వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు మంత్రిని దుశ్శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని, స్వామి వారి ప్రసాదాలను అందించారు.

ట్రాప్ కెమెరాకు చిక్కిన పులి సంచారం

భీమడోలు : మండల పరిసర ప్రాంతాల్లో గత మూడు రోజులుగా సంచలనం సృష్టించిన పులి సంచారం అటవీ శాఖ అమర్చిన ట్రాప్ కెమెరాలో ఆదివారం రాత్రి చిక్కడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పులి సంచారాన్ని ఖరారు చేసేందుకు ఇప్పటికే ఆ ప్రాంతంలో దొరికిన పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగించి నమూనాలను తయారు చేశారు. వీటిని ల్యాబ్‌లో పరిశీలించేందుకు అటవీ శాఖ రేంజర్ రాజమండ్రి పంపారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలో పులి సంచారం జాడ కనిపించింది. దీంతో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖాధికారి ఆశా కిరణ్ సోమవారం ఆ ప్రాంతానికి వచ్చారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రాప్ కెమెరాలకు అదనంగా మరొక రెండు ట్రాప్ కెమెరాలను పులిజాడ కనిపించిన అందాలమ్మ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు.



ట్రాప్ కెమెరాలో నమోదైన పులి సంచారం

అభివృద్ధి శూన్యం.. నిధులు దుర్వినియోగం..!

పనులు చేయకుండా చేసినట్లు చూపుతున్నారని ప్రజల విమర్శ

నగర పంచాయతీ ఎఒకు కూడా తెలియని సమాచారం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగరపంచాయతీలో ఉన్న వేగిలింగేశ్వరి చెరువు అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తయ్యాయని నగర పంచాయతీ అధికారులు చెబుతున్నారే కాని అక్కడ ఎలాంటి పనులు జరిగినట్లు కనిపించడంలేదని చెబుతున్నారు. కనీసం నగర పంచాయతీ ఎఒకు కూడా సమాచారం ఇవ్వకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువును పూర్తిగా శుభ్రం చేయడానికి రూ.12 లక్షలు ఖర్చు పెట్టినా మళ్లీ యధావిధిగా చెరువు ఉంది. పనులు చేయకుండానే బిల్లు పెట్టుకున్నారని విమర్శలు వినవస్తున్నాయి.

చింతలపూడి నగర పంచాయతీలో ఉన్న వేగిలింగేశ్వరి చెరువులో పర్యావరణ కాలుష్య నివారణకు, చెరువులో నీటి పరిరక్షణ కోసం రూ.78 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా పది రకాల పనులు చేపట్టారు. చెరువుగట్టు వాకింగ్ ట్రాక్, చెట్లు నాటడం, చెరువు చుట్టూ చైన్ లింకు ఫెన్సింగ్, డ్రిప్ ఇరిగేషన్, నేమ్ బోర్డ్, ఐరన్ గేట్, డిసైలటింగ్, రిఫర్మేషన్ అండ్ ప్రొఫిలింగ్, అఫ్ ఎగ్జిస్టింగ్, బండ్, విత్ గ్రావెల్, సీసీ కేర్బ్ ఇలా పలు పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూ.78 లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది.

గ్రౌండ్ స్థాయిలో రూ.78 లక్షల పనులు ఎక్కడా కనిపించడం లేదని ప్రజా సంఘాల నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇందులో రూ.16 లక్షలకు డ్రెయినేజీలు తీయించాలని, చెరువులో ఉన్న చెత్తాచెదరాలను పూర్తిగా తొలగించడానికి, చెరువులో వాటర్‌ని రీసైక్లింగ్ చేయడానికి, సుమారుగా రూ.12 లక్షలు, డ్రిప్ ఇరిగేషన్ రూ.30 వేల నిధులతో పనులు చేసినట్లుగా చెబుతున్నారు. కాని అక్కడ పనులు జరిగినట్లుగా కనిపించని పరిస్థితి. ఈ పనులు పూర్తయిన తర్వాత నగర పంచాయతీ ఎఒకు ఏ పనులు ఎంత బడ్జెట్‌తో చేశారో పూర్తిగా అప్పగించాల్సి ఉంది. కాని ఇప్పటివరకు అప్పగించలేదని చెబుతున్నారు. కనీసం నిధులు మంజూరైన దగ్గర నుంచి పని పూర్తయ్యే వరకు తనకు సమాచారం అందించలేదని నగర పంచాయతీ ఎఒ చెబుతున్నారు. కనీసం నగర పంచాయతీ అధికారులకు తెలియకుండా, పని పూర్తయిన తర్వాత చెరువును నగర పంచాయతీకి అప్పగించకుండా, ఇప్పటివరకు ఎందుకు ఉన్నారో తెలియని పరిస్థితి. ఏ పనికి ఎంత ఖర్చు పెడుతున్నారో, ఎంత నిధులు కేటాయించారో నగర పంచాయతీ అధికారులకు కూడా తెలియదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 2022లో పూర్తయినా ఇప్పటివరకు నగర పంచాయతీకి అప్పగించలేని పరిస్థితి. నిధులు ఖర్చు పెట్టారా లేక దుర్వినియోగం చేశారా అనేది ఉన్నతాధికారులు విచారణ చేయాలని ప్రజా సంఘా నాయకులు కోరుతున్నారు.



వేగిలింగేశ్వరి చెరువు ఇదే...

ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి

ఆర్ఎస్.నారాయణ, సిపిఎం మండల కన్వీనర్

రూ.78 లక్షలతో చేపట్టిన వేగి లింగేశ్వరచెరువు పరిరక్షణ పనులు పూర్తయ్యాయా లేదా అనేది ప్రశ్నగా మారింది. అక్కడ చుట్టూ ఫెన్సింగ్ తప్ప వేరే పనులు చేసినట్లుగా కనిపించడం లేదు. నిధులు దుర్వినియోగమైనట్లు అనుమానం కలుగుతుంది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.

పనులు, ఖర్చుల వివరాలు ప్రజలకు చెప్పాలి

టి.బాబు, సిపిఐ నాయకులు

నగర పంచాయతీలో చెరువు నీరు కాలుష్యం అవ్వకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత 2.0 పథకం చేపట్టాయి. ఇందులో భాగంగా చింతలపూడి నగర పంచాయతీకి మంజూరైన రూ.78 లక్షలపై అధికారులు ఏ పరనుకు మొత్తం ఎంత ఖర్చు పెట్టారో ప్రజలకు తెలియజేయాలి.

మాకు సమాచారం కూడా లేదు

శ్రీను, నగర పంచాయతీ ఎఒ

వేగి లింగేశ్వరస్వామి చెరువు నీరు పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చింతలపూడికి రూ.78 లక్షలు మంజూరు చేశాయి. కాని ఇప్పటివరకు మాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. పనులు పూర్తయ్యాయని చెబుతున్న మాకు ఇప్పటి వరకు అప్పగించలేదు. బిల్లులు ఎంత అయ్యాయోయ, దేనికి ఖర్చు అయ్యాయ్యో వివరాలు మాకు తెలుపలేదు.

గుండెపోటుతో హవల్దార్ ప్రవీణ్‌కుమార్ మృతి

కొయ్యలగూడెం : దేశ సేవలో తరిస్తున్న హవల్దార్ రావిపాటి ప్రవీణ్‌కుమార్ (40) గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఇటీవల ఇంటికొచ్చారు. తిరిగి కొయ్యలగూడెం నుండి రాజస్థాన్‌కు బయల్దేరి ఈ నెల 20వ తేదీ రాత్రి వైజాగ్ రైల్వే స్టేషన్‌కు చేరుకోగా అక్కడ గుండెపోటు రావడ ంతో మృతి చెందారు. ప్రవీణ్ కుమార్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ప్రవీణ్‌కుమార్ భౌతికకాయం సోమ వారం ఉదయం కొయ్యలగూడెం చేరుకోగానే గ్రామం లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. పరింపూడి సర్పంచి ముప్పిడి విజయకుమారి ప్రవీణ్‌కుమార్ సేవలను కొనియా డారు. ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రశాంతంగా ముగిసిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు 14వ రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 186 మందికి 166 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 96 మందికి 71 మంది హాజరుకాగా 25 మంది గైర్హాజరయ్యారు. నేటితో టెట్ పరీక్షలు ముగిశాయనిజిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ అబ్రహం తెలిపారు. ఈ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

అఖిల్ కాలేజీ డైరెక్టర్‌కు జాతీయస్థాయి పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ



సూర్యనారాయణను అభినందిస్తున్న వక్తలు

డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని సదరన్ ప్రయివేట్, లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ గుంటూరులోని స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో కాకినాడ అఖిల్ కాలేజ్ డైరెక్టర్ ఆంధ్ర సూర్యనారాయణకు ఎపిజె అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభ అవార్డును ఎంఎల్‌సి కె.లక్ష్మణరావు అందించారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించినందుకు ప్రయివేట్ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేసినందుకు ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చించినందుకు, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఈ అవార్డు లభించినట్లు ఆంధ్ర సూర్యనారాయణ తెలిపారు. అఖిల్ కాలేజీ లెక్చరర్లు ఎజివిఎస్.ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, సిహెచ్.కృపానందం, ఎం.సూర్యమోహన్, గోవిందరావు, శ్రీరామ పటాన్, సాయి భార్గవి, చలపతి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కుక్కునూరు

నూతనంగా రోడ్డును ఎన్ని కిలోమీటర్ల వరకు నిర్మిస్తారో ప్రజలకు చెప్పాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు కోరారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో పలు ప్రజా సంఘాల సమావేశం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడారు. కుక్కునూరు మండలానికి చాలా సంవత్సరాలకు నూతన రోడ్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కానీ రోడ్డు నిర్మాణం నాణ్యత లేకపోవడంతో ప్రజలు భయాందోళనకు చెందుతున్నారన్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు వెంటనే స్పందించి రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేస్తూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, వెంకటాపురం నుంచి కుదుములపాడు వరకు రోడ్డు నిర్మించాలని, లేకపోతే ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు యర్రం సాయికిరణ్, మహబూబ్ పాషా, పులవరుపు రమేష్, పట్ల లక్ష్మయ్య, ఎండి.పుల్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగ సమస్యలపై, ప్రజా సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఐ నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ముసునూరు, లింగపాలెం మండలాల్లో రైతులకు మొక్కజొన్న విత్తనాల కంపెనీల వారు నకిలీ విత్తనాలు ఇవ్వడంతో రైతులకు దిగుబడి రాక తీవ్ర నష్టాలకు గురయ్యారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బిజెపియు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మొక్కజొన్న విత్తనాలు దిగుబడి రాకపోతే ఎకరాకు ఒక రకానికి రూ.75 వేలు, మరో రకానికి రూ.80 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని హైదరాబాద్‌కు చెందిన సాయి భవ్య సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్, త్రిమూర్తి సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్, కర్నూలు చెందిన హై వేజ్ సీడ్స్ కంపెనీల ఆర్గనైజర్స్ సీడ్స్‌ని సరఫరా చేశారని తెలిపారు. రైతులను మోసం చేసిన మొక్కజొన్న సీడ్స్ కంపెనీల మీద ఆర్గనైజర్స్‌పై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌కు వినతిపత్రం అందించారు.

లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మహిళలకు లైంగిక వేధింపుల నివారణ పోష్ యాక్ట్‌పై అవగాహన ఉండాలని ఉమెన్ ప్రొటెక్షన్ సిఐ ఎస్.సరిత సూచించారు. ఆశ్రం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళల భద్రత, స్వీయ రక్షణ గురించి అవగాహన కార్యక్రమాన్ని ఆశ్రం ఆసుపత్రిలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నర్సింగ్ విద్యార్థులు ప్రస్తుత సమాజంలో ఆడవారి అవగాహనకు సంబంధించిన నాటకాన్ని ప్రదర్శించారు. ఆశ్రం హాస్పిటల్ యాజమాన్యం సరితను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమంతట తాము సురక్షితంగా ఎలా ఉండాలో, ఆపీసులో సహా ఉద్యోగులతో ఎలా పనిచేయాలో సూచించారు. ఆఫీస్ పరిధిలో ఎటువంటి మంచి వాతావరణం కలిగి ఉండాలనే విషయాలను విద్యార్థులకు వివరించారు.


ముదినేపల్లి ఎస్‌ఐగా వీరభద్రరావు

ముదినేపల్లి :ముదినేపల్లి ఎస్‌ఐగా విఎస్.వీరభద్రరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల ఎస్‌ఐగా పని చేస్తున్న వీరభద్రరావు బదిలీపై ముదినేపల్లి వచ్చారు. ముదినేపల్లి ఎస్‌ఐగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన డి.వెంకట్‌కుమార్ కైకలూరు టౌన్ ఎస్‌ఐగా బదిలీపై వెళ్లారు.

ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేయించుకోవాలి

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి



సభ్యత్వ నమోదు కార్డు ఇస్తున్న ఎంఎల్‌ఎ

ప్రతి కార్యకర్త టిడిపి సభ్యత్వ నమోదు చేయించుకోవాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రూ.లక్షతో టిడిపి జీవిత కాల సభ్యత్వ నమోదును రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా టిడిపి సీనియర్ నాయకుడు సూరానేని గోపీనాథ్ చేసుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మహంకాళి రామ్మోహన్‌రావు రూ.లక్షతో జీవిత కాల సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఆయనకు సభ్యత్వ కార్డును ఎంఎల్‌ఎ అందించారు. గోపీనాథ్‌ను, మహంకాళి రామ్మోహన్‌రావును అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో ముందు వరుసలో ఉండాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు.

నేరాలు - ఘోరాలు

విహారయాత్రలో విషాదం

వాటర్‌ఫాల్స్‌లో స్నానం చేస్తూ యువకుడు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు



రవితేజ (ఫైల్‌ఫోటో)

విహారయాత్రకు వెళ్లిన యువకుడు వాటర్‌ఫాల్స్‌లో స్నానం చేస్తూ గల్లంతై మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేబ్రోలుకు చెందిన కరణం రవితేజ (22) తన మిత్ర బృందంతో ఈ నెల 17వ రాత్రి మారేడుమిల్లి విహార యాత్ర కు వెళ్లారు. ఆ మరుసటి రోజు శుక్రవారం మధ్యాహ్నం మోతుగూడెం వాటర్ ఫాల్స్ వద్ద స్నేహితులంతా స్నానాలకు దిగారు. అక్కడ స్నానం చేస్తూ రవితేజ కనిపించకపోవడంతో మిత్రులంతా వెతికారు. ఎక్కడా జాడ తెలియకపోవడంతో చింతూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదం జరిగిన ప్రాంత తమ పరిధి కాదని పోలీసులు చెప్పడంతో మోతుగ్గుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, స్నేహితులు వెతికినా గల్లంతైన రవితేజ ఆచూకీ లభ్యం కాలేదు. చేబ్రోలులో రవితేజ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆదివారం సంఘటనా స్థలానికి వెళ్లి వెతకగా స్నానానికి దిగిన ప్రాంతానికి సుమారు కిలోమీటరు దూరంలో రవితేజ మృతదేహం కపిపించింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందించారు.

నాటుసారా స్వాధీనం

కుక్కునూరు :కుక్కునూరు మండల పరిధిలోని వేలేరు గ్రామంలో పోలీసులు దాడులు నిర్వహించి పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సిఐ రమేష్‌బాబు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి వేలేరు గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన నాటుసారా సరఫరా చేస్తున్న నున్నావత్ సురేష్ వద్ద పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు.

కలప స్వాధీనం

కొయ్యలగూడెం :అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న కలపను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కన్నాపురం అటవీశాఖ కార్యాలయ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి తాడేపల్లిగూడేనికి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి - పోలవరం



చింతలపూడిలో...

విధి నిర్వహణలో అమరులైన పోలీసులు నిజమైన దేశ భక్తులని, వారి త్యాగాలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువరని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి స్థానిక ఏటిగట్టు సెంటర్ వరకూ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏటిగట్టు సెంటర్ వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ బాలసురేష్ బాబు, ఎస్‌ఐ పవన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడులోని పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గతేడాది ఆగిరిపల్లిలో వినాయక నిమజ్జనంలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన కానిస్టేబుల్ గంధం నరేంద్రకు జోహార్లు అర్పించి మూడు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ నిర్వహించారు.

చింతలపూడి : పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చింతలపూడి సిఐ కార్యాలయం నుంచి పాతబస్టాండ్, బోసు బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది బోసుబొమ్మ సెంటర్‌లో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ రవీంద్ర నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీగూడెం ఎస్‌ఐ వెంకన్న, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు చిరస్మరణీయులని ఆగిరిపల్లి ఎస్‌ఐ కె.శుభశేఖర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గతేడాది వినాయక చవితి బందోబస్తులో ఒక ఉన్మాది దాడిలో చనిపోయిన గంధం నరేంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఆగిరిపల్లి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

కలిదిండి : మండలంలోని మూలలంకలో బలిమెల వద్ద మావోయిస్టుల కాల్పుల్లో ప్రాణాలర్పించిన కర్రి మనోజ్ కుమార్ విగ్రహం వద్ద పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు. తొలుత కలిదిండి ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. మూలలంక వరకు పోలీస్ సిబ్బంది బైక్ ర్యాలీ చేశారు. అనంతరం జరిగిన సభలో కైకలూరు రూరల్ సిఐ వి.రవికుమార్, సర్పంచి మహాదేవ విజయబాబు మాట్లాడారు. కలిదిండి, మండవల్లి, కైకలూరు రూరల్ ఎస్‌ఐలు ఐ.వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, వి.రాంబాబు, పోలీస్ సిబ్బంది, మనోజ్ కుమార్, తల్లిదండ్రులు కర్రి సత్యనారాయణ, అప్పాయమ్మ, డిసి మాజీ ఛైర్మన్ సారిక వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ అధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రధాన జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అశువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు.

మండవల్లి : విద్యార్థులతో గ్రామంలో భారీ ర్యాలీతో పాటు మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామచంద్ర మాట్లాడారు. పోలీసుల విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ రాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్టేషన్ ప్రాంగణంలోని అమరవీరుల స్థూపం వద్ద పోలీసులు శ్రద్ధాంజలి ఘటించారు. గతేడాది ఆగిరిపల్లిలో వినాయక చవితి వేడుకల సందర్భంగా విధులు నిర్వహిస్తుండగా దుండగుల చేతిలో అమరుడైన కానిస్టేబుల్ గంధం నరేంద్ర మృతికి పోలీసులు నివాళులర్పించారు. అనంతరం ప్రకాశం కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, గణేష్ సెంటర్లో మానవహారం నిర్మించి, అమరుడైన నరేంద్రకు జోహార్లు అర్పించారు.

ద్వారకాతిరుమల : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ద్వారకాతిరుమలలోని పోలీస్ సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని మెయిన్ రోడ్డు గుండా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భీమడోలు సిఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ టి.సుధీర్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ నుంచి కుక్కునూరు ప్రధాన రహదారుల వెంబడి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు విద్యార్థులు, పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు మాట్లాడారు. బుట్టాయగూడెం ఆటో యూనియన్ స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత

జీలుగుమిల్లి : పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం పోలీస్‌పేరెడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో సర్కిల్ పరిధిలో ఉత్తమ సేవలందించినందుకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు ప్రశంసపత్రం అందుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న ఆయనకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసపత్రం అందుకోవడంతో మండలంలోని పలువురు అభినందనలు తెలిపారు.

చింతలపూడి : పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో సురేష్ ఉత్తమ ఉద్యోగ అవార్డు పొందారు. డిఐజి, ఎస్‌పి, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్‌ను పలువురు అధికారులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు హీల్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని తోటపల్లి హీల్ స్కూల్ బాలికల బృందం రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో రెండో స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హీల్ స్కూల్ ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. భారత్ వికాస్ పరిషత్ సెంట్రల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రూపు సాంగ్స్ విభాగంలో హీల్ బాలికల బృందం ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు హేమలత, టైసన్, మాలతిలు విజేతలను అభినందించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శనివారపుపేట అన్ని నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, గవరవరం గట్టు కాలనీలకు డ్రెయినేజీ కల్వర్టు నిర్మించాలని, శ్రీరామ్‌నగర్‌లో డ్రెయినేజీలు సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శనివారపు పేటలో సిపిఎం స్థానిక శాఖ సభ మురళి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సిపిఎం పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు గోట్టాపు మురళి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో శనివారపుపేట సిపిఎం కార్యదర్శి గొట్టాపు రవికిషోర్ మాట్లాడుతూ శనివారపు పేట గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలపడం వల్ల పంచాయతీ ప్రజలకు ఇంటి పన్నులు, నీటి కుళాయి పన్నులు భారీగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఇంటి, నీటి పనులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్, నాయకులు రామాంజనేయులు మాట్లాడారు. ఈ సభలో చంద్రరావు, అప్పారావు, మీరా, గణేష్, రంగమని, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ముసునూరు

తమకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృతిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులు ఆహార భద్రతకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మండల కో-ఆర్డినేటర్ బుడుపుల జయశ్రీ మాట్లాడుతూ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ప్రపంచ ఆకలి దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం పరిగణించాలని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం తప్ప మరొకటి కొనలేని దుస్థితిలో నేడు నిరుపేద కుటుంబాలు మగ్గుతున్నాయని వాపోయారు. అనంతరం నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ ఎం.వాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఎం.పెద్దవెంకటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, జి.చిన్నవెంకటేశ్వరరావు, సుబ్బారావు, బి.నాగరాజు, జి.సత్యవతి, బి.వీరమ్మ, జి.సంధ్యారాణి, ఎం.సుబ్బలక్ష్మి, కె.మల్లేశ్వరి, జి.నాగమ్మ పాల్గొన్నారు.

'మీకోసం' అర్జీలు త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం ఆర్‌డిఒ ఎం.వాణి సోమవారం నిర్వహించారు. నూజివీడు డివిజన్ పరిధిలో 12 అర్జీలు స్వీకరించామని ఆర్‌డిఒ తెలిపారు. స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెదపాడు : గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రూపకల్పన చేసిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అమీలు జమ, తహశీల్దార్ కృష్ణజ్యోతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ :అధికారులమని వీడియో కాల్స్ ద్వారా ఎవరైనా ఫోన్ చేస్తే వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని లేదా 112కు సమాచారం ఇవ్వాలని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌తో పాటు జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్ర సంయుక్తంగా ఈ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఫిర్యాదుదారులు తమ తమ ఫిర్యాదులను ఎస్‌పికి అందించారు. ఫిర్యాదులపై ఎస్‌పి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. సిబిఐ అధికారులమని, ఇంటెలిజెన్స్ అధికారులమని ఫోన్‌లో వీడియో కాల్స్ ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేసి వారి ఖాతాల నుంచి సొమ్ములు కాజేస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రీవెన్స్‌కి వచ్చిన ఫిర్యాదులన్నిటిని సత్వరమే పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి : సిడబ్ల్యూఎఫ్‌ఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశ అభివృద్ధిలో కీలకంగా ఉన్న నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అఖిలభారత భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ (సిడబ్ల్యూఎఫ్‌ఐ) ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబా డిమాండ్ చేశారు. జిల్లా సిఐటియు కార్యాలయంలో ఎపి భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర వర్క్‌షాప్ రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపు అభివృద్ధి మౌలిక సదుపాయాలు ప్రాజెక్టుల కోసం మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తామంటూనే ఆ అభివృద్ధికి అత్యంత కీలకమైన నిర్మాణ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని, ఇసుక కొరత సమస్యను పరిష్కరించాలని, నిర్మాణ సామగ్రిపై జిఎస్‌టి తగ్గించి నిర్మాణ కార్మికుల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ వర్క్‌షాపులో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహరావు, రాష్ట్ర కోశాధికారి కెవి.గోపాలరావు, రాష్ట్ర నాయకులు పిల్లి నరసింహరావు, ఎం.సుందర్‌బాబు, అల్లాడి గోపాలరావు, రొంగల ఈశ్వరరావు, బి.సాంబశివ, రాజనాల సురేష్, జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు పెద్దిరాజుకు అరుదైన పురస్కారం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో 19, 20వ తేదీల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో పంగిడిగూడెం తెలుగు ఉపాధ్యాయుడు, కవి, వ్యాసకర్త డాక్టర్ మద్దాల పెద్దిరాజు పాల్గొన్నారు. ఈ కళాజాతరలో శ్రామిక జీవుల కోసం ఆయన రాసిన నా సిరాచుక్క ఎదురుచూస్తోంది అనే కవితను పఠించినందుకు, మాతృభాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషిని గుర్తించి, అభినందిస్తూ ఈ కళాజాతరలో పాల్గొన్నందుకు తెలుగు సాహితీరంగ చరిత్రలో 24 గంటలపాటు నిర్విరామంగా నిర్వహించిన రికార్డుగా గుర్తించి అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టిఎన్ఎ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పెద్దిరాజు పేరును ధ్రువీకరిస్తూ శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ శ్రీ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం, జాతీయ కన్వీనర్ రమావతి, ప్రధానకార్యదర్శి పార్థసారధి తదిరత సాహితీవేత్తలు పెద్దిరాజును శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పెద్దిరాజును పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సురేష్, ఉపాధ్యాయులు, సాహితీఅభిమానులు అభినందించారు.

అంగన్‌వాడీ సెంటర్లను సందర్శిస్తున్న సూపర్‌వైజర్

భయాందోళనలో అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కొయ్యలగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీలను సూపర్‌వైజర్ వేధించిన ఘటనపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆమె సెంటర్లను సందర్శించడంతో అంగన్వాడీలు భయాందోళనకు గురవుతున్నారు. సూపర్‌వైజర్‌పై వచ్చిన ఆరోపణలపై ఈ నెల 15వ తేదీన ఏలూరు కలెక్టర్ కార్యాలయం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అయితే విచారణ ఇంకా ముగియకముందే ఆమె సెంటర్లను సందర్శిస్తుండటంతో అంగన్వాడీలు ఆందోళన చెందుతున్నారు. పూర్వపు ఘటనతో ఇప్పటికే సమస్యలు ఎదుర్కొంటున్న అంగన్వాడీలు, ఉన్నతాధికారి అయిన ఆమె తమ ఉద్యోగ భద్రతకు ముప్పు తెస్తుందని భావిస్తున్నారు. త్వరగా విచారణ ముగించి సూపర్‌వైజర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు కోరుతున్నారు.

పోలీసు విధివిధానాలపై అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు పోలీసు విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలని కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవి.అప్పారావు అన్నారు. మండలంలోని కేతవరం పాఠశాలలో మాండెటెజ్, ఆఫ్రో కంపెనీల ఆధ్వర్యంలో పిల్లలకు పోలీసు విధివిధానాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అప్పారావు మాట్లాడుతూ సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడుతూ చట్టాన్ని పాటించని వ్యక్తులను అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, టి.నరసాపురం మండల ఆఫ్రో కో-ఆర్డినేటర్ లక్కపాము అశోక్, మహిళా పోలీసు పి.రాధమ్మ, ఎఎన్ఎం ఏసుమరియ, ఆశావర్కర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చర్మవ్యాధుల నూతన చికిత్స విధానంపై అవగాహన

ఏలూరు సిటీ :చర్మవ్యాధులపై నూతన చికిత్స విధానంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఆశ్రం హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ ప్రముఖ ఐఎడిబిఎల్ఎస్ఐజి చర్మ శస్త్ర చికిత్స కమిటీ అనుసంధానంతో చర్మవ్యాధుల విభా గంలో ఉన్న వైద్య విద్యార్థులకు ఈ సర్జరీ విధానాలను తెలియ జేసేందుకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ చర్చా వేదికలో సంబంధిత చికిత్సలో భాగంగా చికిత్స విధానం, ఆపరేషన్ చేసే విధానం, బొల్లి వ్యాధుల చికిత్సలు, పుట్టు మచ్చలు తీసివేసేందుకు ఆపరేషన్, చర్మంపై ఏర్పడు కంతులు తీసేందుకు అవసరమయ్యే ఆపరేషన్లపై ప్రముఖ ఆశ్రం సర్జనులచే ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి

మండవల్లి :రహదారుల అభివృద్ధి రవాణా సౌకర్యంతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి మండలంలో 29 గ్రామపంచాయతీల్లో 20 గ్రామాలకు పైగానే రోడ్లు సరిగా లేవన్నారు. దీంతో ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేక ప్రజలు రాకపో కలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు కాలినడకన ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రోడ్లను వెంటనే మరమ్మతులు చేయించి బస్సు సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, కె.సూర్యారావు పాల్గొన్నారు.

బయ్యన్నగూడెం రైతుకు ప్రతిష్టాత్మక పురస్కారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యనగూడెం గ్రామానికి చెందిన రైతు సుంకర సత్తిరాజు గో ఆధారిత వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తున్నందుకు ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ డాక్టర్ ఐవి.సుబ్బారావు రైతు నేస్తం పురస్కారం అందుకున్నారు. విజయవాడలో అక్టోబర్ 20న స్వర్ణభారత ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

ఉద్యాన రైతుకు జీవనాడి ఉపాధి హామీ చట్టం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని ఉద్యాన రైతుకు జీవనాడిగా, ఆర్థికంగా వెన్నుముకగా ఉపాధి హామీ చట్టం నిలుస్తుందని ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు మండలానికి సంబంధించి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం సంచాలకులు 500 ఎకరాలను ఉద్యాన పంటలు లక్ష్యంగా నిర్దేశించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర నిర్మాణ రంగంలో నాణ్యతకు పెద్దపీట వేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆయన ఆదేశించారు.

చినవెంకన్నకు రూ 3.03 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ హుండీలు సోమవారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 34 రోజులకు రూ.3,03,89,678 ఆదాయం వచ్చింది. భక్తుల కానుకల రూపేణ 597 గ్రాముల బంగారం, ఎనిమిది కేజీల 244 గ్రాముల వెండి, పాత రూ.500 నోట్లు 45, రూ.రెండు వేల నోట్లు 39, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ ఇఒ మూర్తి తెలిపారు.

ఎంఎల్‌సి ఓటు నమోదు చేసుకోండి

కుక్కునూరు :గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతిఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు మార్చిలో జరుగనున్నాయని తెలిపారు. ఆ ఎన్నికల్లో 2021 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసి ప్రొవిజనల్, ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ పొందిన ప్రతిఒక్కరూ నవంబర్ 26వ తేదీ లోపు ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

నూజివీడు టౌన్ :దీపావళి పండుగ పురస్కరించుకుని తాత్కాలిక బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డిఒ ఎం.వాణి సూచించారు. నివాస గృహాలకు దూరంగా దుకాణం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధికారుల సూచనలు, నియమ నిబంధనలు పాటించాలని చెప్పారు. దుకాణాల ఏర్పాటుపై ఫైర్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.